క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



మండవల్లి: పెరికెగూడెంలో శ్రీ ఆది విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పార్టీ కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, సర్పంచ్ పెరుమాళ్ల పద్మ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పెరుమాళ్ల లక్ష్మీకాంతం, సోములరెడ్డి, సత్యనారాయణ, ఉపసర్పంచ్ ప్రదీప్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండారెడ్డి, పెద వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానం ముఖమండపం పునఃనిర్మాణానికి దాతలు విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ వై శ్రీనివాస్ గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన దొగ్గ కృష్ణారావు రూ. 10,116లు అందజేసినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఈఓ తెలిపారు. 20 రోజుల్లోగా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మచిలీపట్నం వారికి తమ దరఖాస్తులను పంపించవలసిందిగా సూచించారు. అలాగే ఆలయంలో ఈనెల 16వ తేదీన బహుళ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

తాడి చెట్టుపై పిడుగు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో గురువారం మధ్యాహ్నం పిడుగులతో కూడిన వర్షం కురిసింది. కూచిపూడిలో డాక్టర్ గొట్టిపాటి రామకృష్ణారావు(పెదపూడి) హాస్పిటల్ ఎదురుగా గల తాడిచెట్టుపై పిడుగు పడి అగ్నికి ఆహుతైంది. చెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో భట్లపెనుమర్రు, పెదసనగంటి పాలెం, చినముత్తేవి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



అడ్డాడ(పామర్రు): క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలో జరిగిన క్రీస్తు సువార్త సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన బాటలో పయనించాలని సూచించారు. అందరూ క్షమ, దయ, శాంతి గుణాలను కలిగి ఉండాలని అప్పుడే సమాజం సస్యశ్యామలంగా మారుతుందని పేర్కొన్నారు. అనంతరం సంబంధిత చర్చి పాస్టర్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పలు సంఘాలకు చెందిన పాస్టర్లు, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

మండవల్లి: మండవల్లి పీహెచ్‌సీ వద్ద కొలువై ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం, భైరవపట్నం బాబా మందిరాల్లో గురువారం అన్నసమారాధనలు నిర్వహించారు. తొలుత బాబా వారికి విశేష పూజలు చేశారు. మండవల్లి బాబా ఆలయంలో ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, ఇన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

వాసవీమాతకు మల్లెలతో అలంకారం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ వాసవీ అమ్మవారి ఆలయంలో వైశాఖ మాసం ఏకాదశిని పురస్కరించుకుని గురువారం అమ్మవారిని మల్లెలతో అలంకరించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చేశారు. అనంతరం లక్ష మల్లెలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గరపు జాలయ్య, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత!

- అధ్వానంగా పామర్రులోని ప్రధాన రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పామర్రులో గోతులు పడి అధ్వానంగా మారిన ప్రధాన రహదారి

పామర్రు: పామర్రు గ్రామంలో ప్రధాన రహదారి గోతులు పడి వర్షపునీటితో నిండిపోవడంతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మాంసం మార్కెట్ నుంచి యలమర్రు రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గ్రామంలోని 14, 15, 16, 17 వార్డు ప్రజలు ప్రతి రోజూ ఈ రహదారి గుండా ప్రయాణించి తమ అవసరాలను తీర్చుకోవాల్సి ఉంది. కానీ రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరి నెలల తరబడి నిల్వ ఉంటున్నాయి. దీంతో స్థానిక ప్రజలు దోమలు, ఈగలతో అవస్థలు పడుతున్నారు.

ప్రయాణం నరకం

రహదారి దుస్థితిని చూసి వెళ్లి పోతున్నారే తప్ప ఏ ఒక్క ప్రజాప్రతినిధి కాని, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఈ రహదారి గుండా ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. గోతుల్లో వాహనాలు పడిపోయి పలువురు క్షతగాత్రులు అవుతున్నారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా సక్రమంగా వెలగని కారణంగా ఇక్కడ ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఈ రహదారి గుండా ప్రయాణించి మా షాపునకు చేరుకోవాల్సి ఉంది. కానీ రహదారి గోతులమయంగా మారడంతో ప్రయాణానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో ప్రయాణానికి నరకయాతన అనుభవిస్తున్నాం. అధికారులు స్పందించి గోతులు పూడ్చించాలి. –నత్తా నాని, చెన్నువానిపురం

మరమ్మతులు చేయాలి



రహదారి అధ్వానంగా మారడంతో ప్రతి రోజూ అవస్థలు పడుతున్నాం. ఈ రహదారి గుండా బస్టాండ్‌కు వెళ్లాలంటే చాలా ఆలస్యం అవుతోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలి. –శేషురెడ్డి, పామర్రు

ఘనంగా జాన్ హెన్రీడ్యున్ హంట్ జయంతి



జాన్ హెన్రీడ్యున్ హంట్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మొవ్వ రెడ్ క్రాస్ సభ్యులు

కూచిపూడి(మొవ్వ): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మొట్టమొదటి నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు సర్ జాన్ హెన్రీడ్యున్ హంట్ జయంతిని నిర్వహించారు. కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొవ్వ మండల తహసీల్దార్, మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మస్తాన్ జాన్ హెన్రీడ్యున్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పమిడిముక్కల మండలం గురజాడ, తోట్లవల్లూరు మండలం నార్త్ వల్లూరు గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి గురైన 5 గృహాల కుటుంబాలకు వంట పాత్రలు, బకెట్స్, టార్పాలిన్స్‌లను అందజేశారు. మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలో శుక్రవారం మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం కురిసిన అకాలవర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో అన్ని రిజర్వాయర్లు పూర్తిగా నింపలేకపోయామని కావున శుక్రవారం ఉదయం సరఫరా పాక్షికంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

అకాల వర్షంతో రైతులకు అవస్థలు



తోట్లవల్లూరులో ఆరబెట్టిన మొక్కజొన్న

తోట్లవల్లూరు: అకాల వర్షంతో రైతులు అవస్థలు పడుతున్నారు. వాతావరణం ఎప్పుడు మారుతుందో, ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరుతోపాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం, పసుపును కాపాడుకొనేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆయా పంటలను పరదాలు కప్పి కాపాడుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అకాల వర్షాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తోట్లవల్లూరు: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్రం గురువారం డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను అంచనా వేసి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని కోరారు. గాలి వాన బీభత్సంతో అరటి తోటలు నేలవాలగా, కల్లాల్లో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న తడిసి అనేక మంది రైతులు నష్టపోయారని అన్నారు. అధికారులు స్పందించి రైతులకు సాయం అందే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పామర్రులో భారీ వర్షం

పామర్రు: గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని పల్లపు ప్రాంతాలైన అరండాల్ పేట, బాపూజీ పేట, గాంధీనగరం తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయాయి. స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో సుమారు రెండు సెంటీమీటర్ల పైగా వర్షం కురిసిందని అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నందివాడ: మండలంలోని తమిరిశ గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త సహాయకురాలి పోస్టుకు బీసీ డీ వర్గానికి చెందిన మహిళ దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సమగ్ర శిశుసంక్షేమ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయకురాలు పోస్టులకు పదవ తరగతి పాసైన 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు.

పామర్రు ప్రాజెక్టు పరిధిలో..

పామర్రు: పామర్రు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వీ భానుశ్రీ గురువారం తెలిపారు. పామర్రు గ్రామంలోని అరండాల్ పేట-2లో ఓసీ అభ్యర్థి, తోట్లవల్లూరు మండలం యాకమూరు గ్రామంలో ఎస్సీ అభ్యర్థి, పమిడిముక్కల మండలం భొశిపూడిపాలెంలో ఓసీ అభ్యర్థి, మర్రివాడ-1లో ఎస్సీ అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 17వ తేదీ లోపు పామర్రులోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

గుడివాడ ప్రాజెక్ట్ పరిధిలో..

గుడివాడ టౌన్: ఐసీడీఎస్ గుడివాడ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ విజయా ఫ్లారెన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 8, 18, 28వ వార్డుల్లో జనరల్, 27వ వార్డులో బీసీ-బీ, వాంబే కాలనీలో బీసీ-డీ, నందివాడ మండలం తమిరిశ గ్రామంలో బీసీ-డీ కేటగిరీల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అదుపు తప్పి బోల్తా పడిన చేప పిల్లల వ్యాన్



నందివాడ: మండలంలోని పుట్టగుంట వంతెన వద్ద చేప పిల్లల వ్యాను బోల్తా పడింది. గుడివాడ నుంచి నూజివీడు వైపు వెళ్తున్న చేప పిల్లల వ్యాన్ ప్రమాదవశాత్తు కాలువలోకి దూసుకెళ్లింది. వ్యాన్ లోపల నీటితో నింపి ఉండటం వల్ల అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

డ్రెయిన్ల నిర్మాణం

కైకలూరు: మేజర్ పంచాయతీ ఆటపాకలో ప్రధాన సమస్యగా మారిన డ్రెయిన్ల నిర్మాణానికి పంచాయతీ నడుం బిగించింది. గ్రామంలో నాగాపురం నుంచి ఆటపాక వరకు పామర్రు-దిగమర్రు జాతీయ రహదారికి ఇరువైపులా గురువారం డ్రెయిన్లు తవ్వారు. అవసరమైన ప్రాంతాల్లో తూములను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్, గ్రామ పెద్ద తలారి జాన్ మాట్లాడుతూ మరో నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

కాశీనాథుని దాతృత్వం స్ఫూర్తిదాయకం



ఆకట్టుకున్న దివ్యాంగులైన చిన్నారుల నృత్య ప్రదర్శన

ఎలకుర్రు(పామర్రు): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు త్యాగం, దాతృత్వం నేటి తరాల వారికి స్ఫూర్తిదాయకమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలో గురువారం రాత్రి వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ గాంధీ అడుగుజాడల్లో నడిచి వివిధ స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్న నాగేశ్వరరావు పంతులు జైలుకు వెళ్లారని అన్నారు. వారి వంశీయులు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులును స్మరిస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కూన రాంజీ మాట్లాడుతూ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు దాతృత్వానికి మెచ్చి గాంధీ మహాత్ముడు విశ్వదాత అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. విద్యా వైద్య రంగాల్లోనే కాకుండా రైతులకు, దివ్యాంగులకు కేడీబీ ట్రస్టు ద్వారా సేవలు అందిస్తున్నారని తెలిపారు.

అవార్డులు ప్రదానం

విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, విశాఖపట్నం ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ ఇంజినీర్ గంట్ల శ్రీనుబాబు, ప్రసార భారతి ప్రతినిధి ముదిగొండ రవిశంకర్, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు వేదాంతం పార్థసారథి, ఉత్తమ ఉపాధ్యాయులు, కూచిపూడి కళాకారిణి శివలెంక ఉషాకిరణ్‌లకు విశ్వదాత అవార్డులను అందజేశారు. విశ్వదాత అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జాతీయ అవార్డు గ్రహీత ముదిగొండ శాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం కేడీబీ ట్రస్టు, శ్యామల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాట్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

కైకలూరులో ఆక్రమణల తొలగింపు



కైకలూరు సెంటర్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

కైకలూరు: జాతీయ రహదారి సమీపాన ఆక్రమణల తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల పలు సందర్భాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పామర్రు – దిగమర్రు(165) జాతీయ రహదారికి ఇరువైపులా శాశ్వతంగా నిర్మించిన అక్రమ దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ ఈఓ ఆనందభూషణం గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ముందుగా మాగంటి థియేటర్ నుంచి తాలూకా సెంటర్ వరకు ఒక వైపున శాశ్వత కట్టడాలు, ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగించారు. పట్టణ శివారు ఏలూరు రోడ్డు వరకు శాశ్వత దుకాణాలను తొలగిస్తామని అధికారులు తెలిపారు.

మీడియాపై దాడులు హేయం



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు పత్రికల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన వారిపై పోలీసుల ద్వారా దౌర్జన్యం చేయించడం, వేధింపులకు గురిచేయడం హేయమైన చర్య అని గుడివాడ నియోజకవర్గ విలేకరులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి ఆర్డీఓ జీ బాలసుబ్రహ్మణ్యంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మీడియాపై దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడులు చేయడం, కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని అన్నారు. ఈ విధమైన చర్యలు మీడియాపై దాడులుగా అభివర్ణించారు. ఇది సాక్షి దినపత్రికపై కక్ష సాధింపు చర్యేనని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విలేకరులు ఆర్ కుమార్, నందిగం పండుబాబు, ఎస్‌కే ఖాసీం, ఎం రామకృష్ణ, వీ బుజ్జిబాబు, దారం ఉపేంద్ర, జీ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాస రచన పోటీలు



మండవల్లి గ్రంథాలయంలో చిన్నారులు



గుడ్లవల్లేరులో ఆటల పోటీల్లో విద్యార్థులు

పామర్రు: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్యపై చిన్నారులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఝాన్సీరాణి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్, లూడో, హౌస్, బిజినెస్, చైనీస్ చెక్కర్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి నాగసురేష్ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని మండవల్లి లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన కోరారు. మండవల్లి గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం పిల్లలకు రీజనింగ్ నేర్పించారు. అనంతరం ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు.

విజ్ఞానంతోపాటు వికాసం

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలతో విజ్ఞానంతో పాటు వికాసం లభిస్తుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పీవీవీ పద్మజ, వాణి పేర్కొన్నారు. గురువారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలతో పాటు ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

ఐఎంఏ నూతన కార్యవర్గానికి సత్కారం



ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గుడివాడ టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గుడివాడ శాఖ నూతన కార్యవర్గ సభ్యులను రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ పుణుకొల్లు శ్రీనివాస్ రోటరీక్లబ్ సభ్యులు కావడం క్లబ్‌కు గర్వకారణమని క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తెలిపారు. స్థానిక జీవీ పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాలులో జరిగిన ఈ సన్మాన సభలో డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ, డాక్టర్ ఉండవల్లి సురేష్ బాబు, డాక్టర్ దేవరపల్లి సూరజ్, రోటరీక్లబ్ కార్యదర్శి జీ కిరణ్‌బాబు, సభ్యులు పీ విశ్వేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు రావి శ్రీహర్ష, రెడ్డయ్య చౌదరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 4 లక్షల విలువైన అల్యూమినియం తీగలు చోరీ



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏఈఈ దేవదాస్

తోట్లవల్లూరు: విద్యుత్ స్తంభాలపై అల్యూమినియం వైరు చోరీకి గురైన ఘటన మండలంలోని పెనమకూరు - కళ్లంవారిపాలెం రహదారిలో జరిగింది. ఇప్పటి వరకు విద్యుత్ మోటార్ల కేబుల్ తీగల చోరీకే పరిమితమైన దొంగలు తాజాగా విద్యుత్ స్తంభాలపై తీగల చోరీకి కూడా పాల్పడటం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. సేకరించిన వివరాల ప్రకారం.. 24 గంటల విద్యుత్ సరఫరాలో భాగంగా మండలంలోని పెనమకూరు నుంచి చాగంటిపాడు రహదారి మీదుగా కళ్లంవారిపాలెం గ్రామానికి విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. అయితే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 30 స్తంభాల మధ్యలో సుమారు నాలుగున్నర కిలో మీటర్ల అల్యూమినియం తీగను కత్తిరించి అపహరించారు. ప్రధాన రహదారి వెంబడి ఎప్పుడూ జనసంచారం ఉండే పెనమకూరు - కళ్లంవారిపాలెం రోడ్డులో ఈ విధంగా జరగడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. సుమారు రూ. 4 లక్షల విలువైన అల్యూమినియం తీగ చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈఈ దేవదాస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. చోరీ ఘటనపై కాంట్రాక్టర్ గిరిధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా చోరీ ఘటనపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యుత్ మెయిన్ లైన్ తీగల చోరీకి పాల్పడిన దొంగలను వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేసవిలో చిన్నపిల్లల పాఠశాల ఏర్పాటు



శిక్షణ పొందిన వారితో అధ్యక్షుడు సాల్మన్

పామర్రు: వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామాల్లో వేసవి పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతోందని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల పేర్కొన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో ఎంపిక చేసిన వారికి గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న వారు వారి వారి గ్రామాలకు వెళ్లి అక్కడ వేసవి శిక్షణ తరగతులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లను కూడా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎం శామ్యుల్, టీ పీటర్ సాల్మన్, కే సునీల్, సుప్రియకుమారి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

మండవల్లి: ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మోటారు సైకిల్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ పేర్కొన్నారు. మండలంలోని లోకుమూడి, చావలిపాడు గ్రామాల్లో జాతీయ రహదారిపై గురువారం పలు వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సరిగాలేని 12 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞా తెలిపారు.